క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాలతో తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ యాతపేటలో షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం ఉదయం చుక్క లక్ష్మి అనే మహిళకు చెందిన పూరిల్లు కాలిపోయింది. తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే బాధితురాలి ఇంట్లో గృహోపకరణ వస్తువులు, పాక్షికంగా నగదు, బంగారు ఆభరణాలు కాలిపోయాయి. నష్టం రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: మిథిలాపురి వుడా కాలనీ, బింద్రానగర్, షిప్‌యార్డు లే అవుట్‌లో ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునఃప్రతిష్టాపనా మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 4 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బ్రహ్మశ్రీ దార్లపూడి సీతారామశర్మ, బ్రహ్మశ్రీ ఇప్పిలి సాయికిరణ్ శర్మ, బ్రహ్మశ్రీ అర్జంగ్ జగదీశ్వర్ పర్యవేక్షణలో ఉత్సవాలు ప్రారంభించారు. 12మంది వేద పండితులతో మొదటి రోజు యాగశాల ప్రవేశం, అఖండ దీప స్థాపన, యాగశాల సంస్కారం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వీధికుక్కలపై విష ప్రయోగం






ఆదర్శనగర్‌లో మృత్యువాత పడిన వీధికుక్కలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు ఆదర్శనగర్‌లో వీధికుక్కలపై విషప్రయోగం జరిగింది. దీంతో నోటివెంట నురుగలు కక్కుకుని శుక్రవారం ఆరు కుక్కలు మృత్యువాత పడ్డాయి. ఈ ప్రాంతంలో ఉండే డి.చంద్రశేఖర్ అనే వ్యక్తి ప్రతిరోజు ఈ మూగజీవాలకు ఆహారం పెట్టేవాడు. ఇతను అందించే ఆహారం కోసం నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు అతని ఇంటి ముందుకు చేరుకుని ఎదురుచూసేవి. మరి కుక్కల వల్ల ఎవరికి ఏ హాని జరిగిందో తెలియదు కాని, ఆహారంలో విషం కలిపిపెట్టారు. నురుగు కక్కుకుని అపస్మారక స్థితిలో ఉండగా చావబాదారు. దీంతో చనిపోయిన వాటి ఒంటిపై గాయాలను చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. దీనిని తట్టుకోలేకపోయిన చంద్రశేఖర్ భీమిలి పోలీసులకు, పశు సంవర్ధకశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు తనిఖీ చేసి వాటిపై విషప్రయోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆమెకు వందనం



ఆమె.. తలచుకుంటే ఏదైనా సాధించగల వీరవనిత.. కష్టాలెన్ని ఎదురైనా చలించని ధీరోదాత్త.. ఆకాశంలో సగం.. అవకాశంలో సగం అంటూ పోరాడిన నాటి నుంచి అన్నింటా మేమే అనే స్థాయికి అంచెలంచెలుగా ఎదిగిన సబల. ఇంటి నుంచి కార్యాలయం వరకు తమ కనుసన్నల్లోని దేనినైనా అందంగా తీర్చిదిద్దగల కళ ఆమె సొంతం. రంగం ఏదైనా నిజాయితీగా శ్రమించడం ఆమె నైజం. జీవనపర్యంతం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా చెదరని చిరునవ్వే ఆమె విజయ రహస్యం. ఆమె ధీరత్వానికి.. కార్యదక్షతకు ఈ మహిళా దినోత్సవ వేళ చేద్దాం.. సలాం..

– పద్మనాభం/తగరపువలస

డెయిరీతో ఆదాయం



నా భర్త శ్రీనివాసరావు చిట్టివలస జ్యూట్‌మిల్లులో పని చేసేవారు. 2009లో మిల్లు మూతపడింది. దీంతో కుటుంబం గడవటానికి ఇబ్బందిగా ఉండేది. అంతకు ముందు నాకు ఆవు ఉండేది. దీంతో డెయిరీ ఏర్పాటు చేసి, పాల వ్యాపారం వైపు అడుగులు వేశాను. దీని నిర్వహణ కోసం దఫదఫాలుగా రుణం తీసుకున్నాను. ప్రస్తుతం 40 ఆవులు ఉన్నాయి. ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నాను. నెలకు రూ.1.20 లక్షల ఆదాయం వస్తుంది. అందులో పశువుల దాణాకు రూ.60 వేలు ఖర్చు అవుతుంది. మా కుమారుడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. భర్త, కుమారుడు డెయిరీ నిర్వహణలో నాకు తోడుగా ఉంటున్నారు.

– **సమ్మిడి సత్యవతి**, రేఖవానిపాలెం, భీమిలి మండలం

టైలరింగ్‌తో పలువురికి ఉపాధి

నేను 2012లో స్వయం సహాయకం సంఘంలో చేరాను. శ్రీ సూర్య స్వయం సంఘంలో సభ్యురాలిని. నాకు స్వయం సహాయక సంఘం ద్వారా రూ.9.40లక్షలు రుణం వచ్చింది. స్త్రీనిధి ద్వారా రూ.2లక్షలు, సీఐఎఫ్ ద్వారా రూ.1.50 లక్షలు, గ్రామ సంఘం ద్వారా రూ.1.50లక్షలు, బ్యాంకు లింకేజి రూ.4లక్షలు రుణం వచ్చింది. సీఐఎఫ్ ద్వారా వచ్చిన రుణంతో మూడు టైలరింగ్ మెషీన్లు కొన్నాను.నేను బట్టలు కుడతాను. మరో ముగ్గురు నా షాపులో బట్టలు కుడతారు. నెలకు టైలరింగ్ ద్వారా రూ.10 వేలు ఆదాయం వస్తుంది. నా దగ్గర పని చేస్తున్న ముగ్గురికి నెలకు ఒక్కొక్కరికి రూ.9వేలు వరకు ఆదాయం వస్తుంది. టైలరింగ్ వల్ల తాను ఉపాధి పొందుతూ మరో ముగ్గురికి ఉపాధి కల్పించడం నాకు ఎంతో గర్వకారణంగా ఉంది. ఎకరం పొలాన్ని లీజుకు తీసుకుని దీనిలో బొప్పాయి వేశాను. నా భర్త సాయంతో సాగు చేస్తున్నాను. అంతర పంటగా కనకాంబరాలు సాగు చేస్తున్నాను. దీనిలో నెలకు రూ.20వేలు ఆదాయం వస్తుంది. టైలరింగ్, వ్యవసాయం ద్వారా నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నాం.

– **సిగల సునీత**, రెడ్డిపల్లి , పద్మనాభం మండలం



టైలరింగ్ షాపు నడుపుతున్న సునీత

ఫుడ్ ప్రొడక్ట్స్‌తో ఆర్థిక స్వావలంబన



ఐదేళ్ల క్రితం రూ.6 లక్షలు పెట్టుబడితో అప్పడాలు, వడియాలు తదితర ఫుడ్ ప్రొడక్స్ తయారు చేసి విక్రయించడం మొదలు పెట్టాను. తరువాత స్త్రీనిధి ద్వారా రూ.లక్ష రుణం, పీఎంఎస్ఈ ద్వారా పూర్తి సబ్సిడీ ద్వారా మరో రూ.లక్ష రుణం తీసుకున్నాను. ప్రస్తుతం నాకు బోయిపాలెం, గుంటూరు (30 ఏళ్ల క్రితమే)లలో యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తుంది. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఇందు ఫుడ్ ప్రొడక్ట్ పేరుతో షాపు ఉంది. దీని ద్వారా రోజుకు రూ.8వేల విక్రయాలు జరుగుతాయి. ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నాను. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలని నా ఆకాంక్ష.

– **గిడుతూరి పూర్ణిమ**, బోయపాలెం, ఆనందపురం మండలం

ఇద్దరు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాను

నేను 2003లో స్వయం సహాయక సంఘంలో చేరాను. శ్రీ సాయి స్వయం సహాయక సంఘం గ్రూపులో సభ్యురాలిని. పదో తరగతి వరకు చదివాను. ఇంకా ఉన్నత చదువులు చదవాలనుకున్నాను. ప్రైవేటుగా డిగ్రీ కట్టి బీఏ పాస్ అయ్యాను. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వీరిని కూడా ఉన్నత చదువులు చదివించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. స్వయం సహాయక సంఘం ద్వారా విడత విడతలుగా మొత్తం రూ.8.60లక్షలు రుణం వచ్చింది. దీనిలో బ్యాంకు లింకేజీ కింద రూ.4.10లక్షలు, స్త్రీ నిధి కింద రూ1.50లక్షలు, సీఐఎఫ్ కింద రూ.3లక్షలు రుణం వచ్చింది. మొదట ఒక ఒక ఆవు కొనుగోలు చేశాను. దీని ద్వారా నాకు నెలకు రూ.1500 అదనపు ఆదాయం వచ్చింది. క్రమంగా ఆరు ఆవులతో డెయిరీ నడపడం ప్రారంభించాను. వీటిలో రూ.50వేలు విలువ చేసే ఆవు మృతి చెందింది. దీని వల్ల కొంత ఆర్థికంగా నష్ట పోయాను. ఒక ఆవును అమ్మేశాను. ఇప్పుడు ఆరు ఆవులతో డెయిరీ ఫారం నడుపుతున్నాను. మాకు ఉన్న 50 సెంట్ల భూమిలో ఎన్‌పీఎం ద్వారా వరి, మిరప, కూరగాయలు పండిస్తున్నాను. డెయిరీ ద్వారా అన్నీ పోను నెలకు రూ.25వేలు, వ్యవసాయం ద్వారా నెలకు రూ.10వేలు మొత్తం నెలకు రూ.35వేలు సంపాదిస్తున్నాను. ఈ డబ్బులతో పెద్ద కుమార్తె అనితను ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు, చిన్న కుమార్తె నిఖిని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఈసీఈ చదివిస్తున్నాను. డెయిరీ ఫారం, ఎన్‌పీఎం వ్యవసాయం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాను.



– **పల్లి అచ్చియ్యమ్మ**, గెద్దపేట, పద్మనాభం మండలం

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే ప్రగతి

- విద్యతోనే ఉన్నతి
- పునరుద్ఘాటించిన వక్తలు
- వేడుకగా మహిళా దినోత్సవం



మజ్జిపేట జెడ్పీహైస్కూల్‌లో మహిళా దినోత్సవం

తగరపువలస: ప్రతి మహిళ విద్యావంతురాలై ఆర్థికంగా స్వావలంబన సాధించాలని విశ్రాంత ఎకనామిక్స్ ప్రొఫెసర్ కె.పద్మ అన్నారు. చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీవాణి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిరక్షరాస్యత దుష్ప్రభావాల గురించి తెలియజేశారు.

➡ మజ్జిపేట జెడ్పీహైస్కూల్‌లో మ్యాజిక్‌బస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి 60 మంది తల్లులకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, మ్యాజిక్‌బస్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ ఆనందపురం మండలం కొంత్యాం ఎస్ఎస్ఆర్‌ఐటీలో జరిగిన మహిళా దినోత్సవంలో బోడవరం సబ్ రిజిస్ట్రార్ బి.గీతాలక్ష్మి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, కార్యదర్శి ప్రసాదరాజు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ బి.ఉషారాణి, బాల తదితరులు పాల్గొన్నారు.

➡ గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన వేడుకలలో విద్యార్థినులు ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజిని నాయుడు, మేరీకోమ్, కల్పనా చావ్లా, యామినీ కృష్ణమూర్తి తదితరుల వేషధారణలో అలరించారు. హెచ్‌ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉపాధ్యాయిని వరలక్ష్మిని సత్కరించారు.



మహిళ దినోత్సవంలో పాల్గొన్న ఐఐఎంవీ సిబ్బంది

➡ సాయి సంహిత ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు భీమిలిలోని వివిధ పాఠశాలల్లో 40 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

➡ నగరంలో జరిగిన వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేతుల మీదుగా రాష్ట్ర శిక్షకరణాల మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతిని సన్మానించారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

మహిళలు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని ఆస్పైర్ ఫర్ హెర్ వ్యవస్థాపకురాలు మధురదాస్ గుప్తా అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐఐఎంవీలో ఇంక్యుబేషన్, స్టార్టప్ హబ్‌లకు మహిళ ఆధ్వర్యంలో వ్యాపార మద్దతు అందిస్తున్నట్టు తెలిపారు. ఐఐఎంవీ గవర్నర్ బోర్డు సభ్యురాలు మాళవిక ఆర్.హరిత, ఫీల్డ్ సీఈవో గుహేష్ రామనాథన్, డైరెక్టర్ చంద్రశేఖర్, శంకరి సుధార్, శివాని తదితరులు ప్రసంగించారు.

పోలీస్ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: బక్కన్నపాలెం సమీపంలోని ఏపీఎస్పీ పోలీస్ శిక్షణా కేంద్రంలో 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ వేడుకలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల కోసం శనివారం ఉచిత వైద్యశిబిరం, మహిళా సాధికారత ప్రధాన అంశంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పద్మనాభంలో..

పద్మనాభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మహిళా ఉద్యోగులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు దుశ్శాలువాలతో సన్మానించారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ కె.ఆనందరావు, ఈవో ఆర్డీ మీనా కుమారి పాల్గొన్నారు.

➡ పాండ్రంగి పంచాయతీ కురపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌వోఎస్ తరపున ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ విద్యార్థులకు కథల పుస్తకాలు, మహిళలకు సోలార్ లైట్లు పంపిణీ చేశారు. ఎస్‌వోఎస్ ప్రతినిధి దుర్గరాజు పాల్గొన్నారు.

➡ తహసీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేశారు. తహసీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న విశ్రాంత ఎకనామిక్స్ ప్రొఫెసర్ పద్మ



గంభీరం ప్రాథమిక పాఠశాలలో..



రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సాయి సంహిత ట్రస్ట్ చైర్మన్ అప్పలరాజు



డబ్బీరు ప్రశాంతిని సత్కరిస్తున్న సీపీ బాగ్చీ



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి



పద్మనాభం : మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు



ఏపీఎస్పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో..

డ్రోన్లతో నిరంతర నిఘా



డ్రోన్ తీసిన చిత్రం

పీఎం పాలెం: జన సంచారం తక్కువ ఉన్న ప్రాంతాలలో పెచ్చుమీరుతున్న అరాచక శక్తుల ఆటకట్టించడానికి పోలీస్ శాఖ డ్రోన్ల సాయం తీసుకుంటోంది. విశాఖ నార్త్ సబ్ డివిజన్‌లోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటీ సెజ్ ఏరియాలో గల మూడు హిల్స్ పై ఉన్న అన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి చుట్టు పక్కల గల ప్రాంతాల్లో డ్రోన్లను ప్రయోగించి నిశితంగా నిఘా ఏర్పాటు చేశామని నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజు, స్థానిక సీఐ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ఇకపై డ్రోన్ల నిఘా 24 గంటలూ ఉంటుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిరోధించడానికి పోలీస్ గస్తీ మరింత ముమ్మరం చేశామన్నారు. మూడు వాహనాలలో 24 గంటలూ పోలీస్ గస్తీ ఉంటుందని తెలిపారు. ఐటీ సెజ్ ఏరియాతో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సీఐ పేర్కొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి అనుపు ఉత్సవం

తగరపువలస: ఎల్లమ్మతల్లి అనుపు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సంగివలసలో పూజారి ఊళ్ల అప్పారావు ఇంటి నుంచి పోతరాజును ఎల్లమ్మ చదురు వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం పూజారి అగ్నిగుండం తొక్కారు. ఈ వేడుకలలో పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు, ఉత్సవ పెద్దలు ఊళ్ల నరసింగరావు, ఊళ్ల నరసింహనాయుడు, కోల అప్పలకొండ, సారిపల్లి మోహనరావు, నమ్మి అప్పలనాయుడు, వంక అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అక్కరమాని రామునాయుడు మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 12 వరకు పైడితల్లమ్మ, పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలో ఎల్లమ్మ అనుపు ఉత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా, డీజే వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా జాతర

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలోని రెల్లివీధి వద్దనున్న ఎల్లమ్మవారి జాతర ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన సంపూర్ణ రామాయణ ప్రవచనాలు

మధురవాడ: శ్రీరామాయణం మధురమైన కావ్యమని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం భూమిపై రామాయణం ఉంటుందన్నారు. మధురవాడ గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అష్టలక్ష్మి దేవాలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో 42 రోజులుగా నిర్వహిస్తున్న సంపూర్ణ శ్రీరామాయణ ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. కార్యక్రమంలో నిర్వాహకులు అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్న 'కూటమి'

మధురవాడ: కూటమి ప్రభుత్వం వైజాగ్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తోందని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జిశ్రీనివాసరావు(చిన్న శ్రీను) అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులున్న రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్‌ను పెండింగ్‌లో పెట్టిందన్నారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లో హాల్లో శుక్రవారం నిర్వహించిన 7వ వార్డు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీచ్ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అధికారులను బలిపశువులను చేశారన్నారు. బడ్జెట్‌లో విశాఖ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధిని విస్మరించడం భావ్యం కాదన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం : పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనలు కింది స్థాయికి వెళ్లాలంటే కార్యకర్తల ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. పార్టీకి కార్యకర్తలే కీలకమన్నారు. వారికి నిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. అన్ని స్థాయిల్లో అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. మధురవాడ పేరులోనే మధురం ఉందని, మధురవాడకి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. త్వరలో ఆనందపురంలో పార్టీ ఆఫీసు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను

12న కలెక్టరేట్ల వద్ద ఆందోళన : విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించాలని, నాణ్యమైన విద్య ఇవ్వాలని, నిరుద్యోగ భృతి తదితర డిమాండ్స్‌పై కలెక్టరేట్‌ల వద్ద ఈ నెల 12న ఆందోళన చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వంకాయల మారుతీ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు చేకూరి రజని, పార్టీ వివిధ విభాగాలు నాయకులు పిళ్లా సూరిబాబు, పిళ్లా పాపారావు, కుడితి రామారావు, వాండ్రాసి రవికుమార్, జగ్గుపల్లి నరేష్, ముగ్గూరి వెంకటరమణ, బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు, పోతిన పైడిరాజు, పెంద్ర అప్పన్న, రామిరెడ్డి, వరలక్ష్మి, రాజు, శ్రీదేవి, ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, గౌరవాధ్యక్షుడు మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.